ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
గురువారం | జూలై 02, 2026 | సంపుటి : 7 | సంచిక : 30 | పేజీలు : 2

## ఉపాధ్యాయురాలిగా మారి.. పాఠాలు బోధించి..


◆ గణితం బోధిస్తూ విద్యార్థులకు స్ఫూర్తినిచ్చిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
2 లో



## సీఎం సవాల్ స్వీకరిస్తున్నా

రేవంత్.. నేను చర్చకు రెడీ
- డేట్, టైం ఫిక్స్ చేయ్
- కేసీఆర్ దిగిపోయే నాటికే రూ.3.50లక్షల కోట్ల అప్పే ఉంది
- కాంగ్రెస్‌కు ఇచ్చిన అవకాశం సగం టైం గడిచింది..
- ఇప్పటి వరకు ఏం చేశారో చెప్పండి
- ఇజ్జత్ పోతుంటే 72 సార్లు ఢిల్లీ ఎందుకు వెళ్లారు?
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2 లో



# ఆదాయం పెంచండి

- బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలి
- పలు శాఖల్లో లీకేజీలు అరికట్టాలి
- నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వీడాలి
- ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

2

రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలను సాధించడానికి ఆదాయ సమీకరణపై కచ్చితంగా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. లీకేజీలను అరికట్టి ఆదాయ సమీకరణకు సంబంధించి చేజింగ్ సెల్‌ను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై ముఖ్యమంత్రి ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు కె. రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదాయ పెంపు విషయంలో ముఖ్యమంత్రి అధికారులకు పలు కీలక ఆదేశాలిచ్చారు. – హైదరాబాద్, ఆయుధం:



## శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యం

◆ వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఐ.పి.ఎస్

**వరంగల్, ఆయుధం:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని, ఇందుకు ప్రజలందరి సహకారం ఎంతో అవసరమని వరంగల్ నూతన పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు. బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ రోజు ఉదయం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి చేరుకున్న నూతన సీపీకి సాయుధ పోలీసులు నూతన కమిషనర్ కు వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ కమిషనర్ ఛాంబర్ లో బదిలీ పై వెళ్ళుతున్న పూర్వ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ నుండి నూతన పోలీస్ కమిషనర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది నూతన పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, నోట్ బుక్‌లను సీపీకి అందజేసి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత మాట్లాడుతూ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు కమిషనరేట్ పరిధిలోని ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది సమన్వయంతో కృషి చేస్తారని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించే విధంగా పోలీసింగ్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తామని పోలీస్ కమిషనర్ తెలిపారు.

## ఆగస్టు 30న నీట్ పీజీ పరీక్ష

- రిజిస్ట్రేషన్ ప్రక్రియ షురూ

**జాతీయం, ఆయుధం:** వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జాతీయస్థాయి అర్హత పరీక్షకు షెడ్యూల్ విడుదలైంది. ఆగస్టు 30న పరీక్ష నిర్వహించనున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ ప్రకటించింది. 1న సాయంత్రం 5 గంటల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని, జులై 21 వరకు ఈ రిజస్ట్రేషన్ ప్రక్రియ అందుబాటులో ఉంటుందని వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ వేదికగా నీట్ పీజీ పరీక్షను నిర్వహించేందుకు ఎన్‌బీఈఎంఎస్ ఏర్పాట్లు చేస్తోంది. పరీక్ష కేంద్రానికి సంబంధించి ముందస్తు సమాచారాన్ని ఆగస్టు 11నే అభ్యర్థులకు తెలియజేస్తామని పేర్కొంది. సెప్టెంబర్ 30 నాటికి ఫలితాలను విడుదల చేయనున్నట్లు తెలిపింది.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బీజేపీ నేతలు

**స్టేషన్ ఘనపూర్, ఆయుధం:** లింగాల ఘనపూర్‌కు చెందిన పలువురు బీజేపీ నాయకులు బుధవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ జడ్పిటిసి గుడి వంశీధర్ రెడ్డి, లింగాల ఘనపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొల్లూరి శివ కుమార్ ల ఆధ్వర్యంలో లింగాల ఘనపూర్ బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు కొండబోయిన సంపత్, జీడికల్ గ్రామ సర్పంచ్ కొండబోయిన మామత, వార్డు మెంబర్ మొల వెంకట్ రెడ్డి, మరో 30మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు జరుగుతున్నాయని అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక నిధులతో నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో



అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అందరం కలిసి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ జడ్పిటిసి గుడి వంశీధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మండల పార్టీ అధ్యక్షుడు కొల్లూరి శివ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


2 లో

## ఐసీసీసీ మాడ్యూళ్లపై అవగాహన అవసరం

- విపత్కర పరిస్థితుల్లో నిర్ణయాలకు ఐసీసీసీ కేంద్రం కీలకంగా పనిచేయాలి
- బల్దియా కమిషనర్ టి. వెంకన్న


2 లో

## పేదలకు ఇండ్లు ఇచ్చేదాకా పోరాటం ఆగదు

- వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి
- ఎం సి పి ఐ (యు) జిల్లా కార్యదర్శులు ఎండి బాష్మియా పెద్దారపు రమేష్ సిపిఎం జిల్లా నాయకుడు సింగారపు బాబు

# ప్రజారోగ్య పరిరక్షణలో వైద్యుల పాత్ర కీలకం

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- రెడ్ క్రాస్ సొసైటీలో జాతీయ వైద్యుల దినోత్సవం



**హనుమకొండ, ఆయుధం:** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ భవన్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు ప్రముఖ వైద్యుడు, భారతరత్న డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ జయంతివర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ సేవలు ప్రతి వైద్యునికి ఆదర్శప్రాయమని, ప్రజారోగ్య పరిరక్షణలో వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడంతో పాటు ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో వైద్యులు తమ సేవలను కొనసాగించాలని ఆకాంక్షించారు, జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని వైద్యులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజారోగ్య పరిరక్షణలో వారి సేవలు మరింత విస్తరించాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ స్మారకార్థం ప్రతి సంవత్సరం జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, వైద్య రంగానికి ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయనను భారతరత్న పురస్కారంతో సత్కరించిందని తెలిపారు. రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ, "అమ్మ మనకు జన్మనిస్తే, అనారోగ్య సమయంలో మన ప్రాణాలను కాపాడి పునర్జన్మను ప్రసాదించేవారు వైద్యులు" అని పేర్కొంటూ, వైద్యుల నిస్వార్థ సేవలు సమాజానికి ఎంతో అమూల్యమని కొనియాడారు. డాక్టర్స్ డే పురస్కరించుకుని హనుమకొండ డీఎం & హెచ్ఓ డా. ఎస్.డి. రాంకుమార్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డా. పి. విజయచందర్ రెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు డా. కె.సుధాకర్ రెడ్డి, డా.మాగంటి శేషుమాధవ్, ఆర్థోపెడిక్ సర్జన్ డా. పి.కాళీప్రసాద్ రావు, ఐఎంఏ అధ్యక్షులు డా.మన్మోహన్ రాజు, ఐఎంఏ ప్రెసిడెంట్ ఎలెక్ట్, వరంగల్ క్లబ్ కార్యదర్శి డా. పి.ప్రవీణ్, తానా అధ్యక్షులు డా.దిలీప్ కుమార్, వరంగల్ క్లబ్ కోశాధికారి డా. పి.సుదీర్ కుమార్, పిల్లల వైద్య నిపుణులు డా. బైరి లక్ష్మీనారాయణ, రెడ్ క్రాస్ వైద్యులు డా. జె.కిషన్ రావు, డా. టి.మదన్ మోహన్ రావు, డా. మొహమ్మద్ తహర్ మసూద్‌లను జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.


ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, డా. మాగంటి శేషుమాధవ్, డా. కె. సుధాకర్ రెడ్డి, రెడ్ క్రాస్ సిబ్బంది పలువురు వైద్యులు పాల్గొన్నారు.



## పేదల కోసం పోరాటాలు తీవ్రతరం చేస్తాం

- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- హనుమకొండ కలెక్టరేట్ ఎదుట వామపక్షాల పికెటింగ్
- అధికారులను అడ్డుకున్న శ్రేణులు, నాయకుల అరెస్టు

2



## నిర్ణీత గడువులోపు ఓటరు గణన ప్రక్రియను పూర్తి చేయాలి

- రాజకీయ పార్టీలు సహకారం అందించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్గడే హేమంత్ సహదేవరావు

2



# ఆదాయం పెంచండి

- బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలు సాధించాలి
- పలు శాఖల్లో లీకేజీలు అరికట్టాలి
- నిధుల సమీకరణలో నిర్లక్ష్యం వీడి సీరియస్‌గా పనిచేయాలి
- ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

**హైదరాబాద్, ఆయుధం:** రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా లక్ష్యాలను సాధించడానికి ఆదాయ సమీకరణపై కచ్చితంగా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. లీకేజీలను అరికట్టి ఆదాయ సమీకరణకు సంబంధించి చేజింగ్ సెల్‌ను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై ముఖ్యమంత్రి ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు కె.రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదాయ పెంపు విషయంలో ముఖ్యమంత్రి అధికారులకు పలు కీలక ఆదేశాలిచ్చారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ ఆదాయ సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, మైనింగ్‌తో పాటు ఇతర శాఖలకు సంబంధించి లీకేజీలను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. ఆదాయ సమీకరణలో చేజింగ్ సెల్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాల్సిందేనని అధికారులకు స్పష్టం చేశారు. అనుకున్న స్థాయిలో పనిచేయాలంటే శాఖలవారీగా సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని చెప్పారు. పెండింగ్ ప్రాజెక్టులను, ఇతర పనులను పూర్తి చేసేందుకు అనుగుణంగా శాఖలవారిగా బడ్జెట్‌ను తయారు చేసుకోవాలని చెప్పారు. ప్రాజెక్టులకు సంబంధించి ప్రధానంగా భూసేకరణను మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం ప్రతిపాదించే బడ్జెట్ ఊహాజనితం కాదన్న విషయం గుర్తుపెట్టుకోవాలని, వాస్తవికత ఆధారంగానే బడ్జెట్ రూపకల్పన జరగాలని స్పష్టం చేశారు. ఆయా శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.



# పోలీస్ కమిషనర్‌ను కలిసిన కలెక్టర్



**హనుమకొండ, ఆయుధం:** వరంగల్ పోలీస్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎన్.శ్వేతను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ బుధవారం జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖతో సమన్వయంతో పనిచేయడానికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

# సీఎం సవాల్ స్వీకరిస్తున్నా

## రేవంత్.. నేను చర్చకు రెడీ: కేటీఆర్

- అడేట్, టైం ఫిక్స్ చేయ్
- కేసీఆర్ దిగిపోయే నాటికే రూ.3.50లక్షల కోట్ల అప్పే ఉంది
- కాంగ్రెస్‌కు ఇచ్చిన అవకాశం సగం టైం గడిచింది..
- ఇప్పటి వరకు ఏం చేశారో చెప్పండి
- ఇజ్జత్ పోతుంటే 72 సార్లు ఢిల్లీ ఎందుకు వెళ్లారు?
- బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, ఆయుధం:** కాంగ్రెస్కు ఇచ్చిన అవకాశంలో 50 శాతం పూర్తయిందని.. ఇప్పటి వరకు ఏం చేశారో ఆ పార్టీ చెప్పుకోలేకపోతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కేసీఆర్ అధికారం నుంచి దిగిపోయేనాటికి రూ.3.50లక్షల కోట్ల అప్పు మాత్రమే ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అప్పుల కారణంగా ఢిల్లీకి వెళితే ఇజ్జత్ పోతోందంటున్న సీఎం.. 72 సార్లు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. తెలంగాణ భవన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రైతుభరోసా నిధుల విడుదల కార్యక్రమంలో సీఎం రేవంత్ చేసిన విమర్శలపై ఆయన స్పందించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా? అని సీఎం విసిరిన సవాల్ను తాను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. తేదీ, సమయం ఫిక్స్ చేయాలన్నారు.

### కేంద్రం సహకరించకపోయినా..

"తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా కేసీఆర్ తీర్చిదిద్దారు. 201415లో రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి 26లక్షల హెకార్లు మాత్రమే. కేసీఆర్ అధికారం నుంచి దిగేపోయే నాటికి ఆ సంఖ్య 59 లక్షల హెక్టార్లకు చేరింది. కాళేశ్వరం ప్రాజెక్టును చూసి ప్రపంచమంతా ఆశ్చర్యపోయింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా ముందుకెళ్లి అద్భుతాలు చేశాం. ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన మేఘాలయ సీఎం కాన్రాడ్ సంగ్మా కమాండ్ కంట్రోల్ సెంటర్ను చూసి ఫోన్ చేసి అభినందించారు.

### కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారు

సీఎం రేవంత్ పదేపదే రాష్ట్రాన్ని అవమానిస్తున్నారు. మమ్మల్ని దూషించండి, కేసులు పెట్టుకోండి.. కానీ తెలంగాణను దూషించవద్దు, ప్రజల మనోస్థైర్యాన్ని దెబ్బతీయవద్దు. ఇంతటి భావదారిద్ర్యం ఉన్న సీఎంను ఎప్పుడూ చూడలేదు. తెలంగాణ గొప్పతనం, ఎదుగుదల రేవంత్కు జీర్ణం కాకపోవచ్చు. పరిపాలన చేతగాక గత ప్రభుత్వంపై ఇంకా ఎన్ని రోజులు ఏడుపులు? సీఎం, డిప్యూటీ సీఎంకు అబద్ధాలు చెప్పడంలో కూడా పొంతన లేదు. కాగ్ లెక్కలు నమ్మాలా? కాకి లెక్కలు నమ్మాలా? సీఎం, కుటుంబ సభ్యుల దోపిడీతో రాష్ట్రం ఆస్తులు కోల్పోతోంది. దండుపాళ్యం ముఠాలా కాంగ్రెస్ నేతలు దోచుకుంటున్నారు. రాహుల్ బంధు, పొంగులేటి బంధు, సోదరుల బంధు బంద్ చేయాలి. అబద్ధాలు ఆడటం రేవంత్కు జన్మహక్కు. ఈసారి ఆయనకు ప్రతిపక్ష పాత్ర కూడా మిగలదు.

### వైఫల్యాలు ఎండగట్టకపోతే రాజకీయాల నుంచి తప్పుకొంటా

అద్భుతమైన ప్రగతిభవన్ ఉంటే దాన్ని వదిలేసి రూ.200 కోట్లతో మరో క్యాంపు కార్యాలయం నిర్మించారు. కాంపౌండ్ వాల్ నిర్మాణానికే రూ.19 కోట్లు ఖర్చు చేశారు. కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం. తేదీ, సమయం ఫిక్స్ చేయాలి. అసెంబ్లీనా? ప్రెస్ క్లబ్లోనా? జూబ్లీహిల్స్ ప్యాలెస్లోనా? ఎక్కడైనా నేను రెడీ. కాంగ్రెస్ రైతు డిక్లరేషన్ ప్రకటించిన వరంగల్ చౌరస్తానా? 2 లక్షల ఉద్యోగాలు అని రాహుల్గాంధీ డైలాగులు కొట్టిన అశోక్ నగర్ చౌరస్తానా? మీరొస్తారో, రాహుల్ గాంధీ వస్తారో రండి. మీ తప్పులను గణాంకాలతో సహా బయట పెడతాం. పాలనా వైఫల్యాలను ఎండగట్టకపోతే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొంటా" అని రేవంత్కు కేటీఆర్ సవాల్ విసిరారు.

# ఉపాధ్యాయురాలిగా మారిన కలెక్టర్

- గణితం బోధిస్తూ విద్యార్థులకు స్ఫూర్తినిచ్చిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- విద్యార్థుల్లో పఠన సామర్థ్యం, గణిత నైపుణ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి



**ఐనవోలు, ఆయుధం:** ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యకు చిరునామాగా నిలవాలని, విద్యార్థుల్లో పఠన సామర్థ్యం, గణిత నైపుణ్యాలు, ఆలోచనా శక్తిని పెంపొందించేలా ఉపాధ్యాయులు బోధన సాగించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా ఉపాధ్యాయురాలిగా మారి ఐదో తరగతి విద్యార్థులకు గణిత పాఠ్యాంశాన్ని బోధించారు. ఒక చేత్తో గణిత పాఠ్యపుస్తకాన్ని కలెక్టర్ పట్టుకొని మరో చేతితో చాక్ పీస్ చేతపట్టి బ్లాక్‌బోర్డుపై స్వయంగా లెక్కలు రాసి విద్యార్థులతో గణితం లెక్కను సాధింపజేయడంతో పాటు వారి అవగాహన, ప్రతిభ, నేర్చుకునే సామర్థ్యాన్ని పరిశీలించారు. పాఠశాల సందర్శనకు వచ్చి తరగతి గదులు పరిశీలిస్తూ వచ్చిన కలెక్టర్ ఐదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ స్వయంగా బోధించడం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. కలెక్టర్ ఉపాధ్యాయురాలుగా మారి పాఠశాల విద్యార్థులకు విద్యా బోధన సాగించడం పాఠశాల ఉపాధ్యాయులకు సైతం స్ఫూర్తినిచ్చింది. విద్యార్థులకు గణిత పాఠ్యాంశాన్ని బోధిస్తూ ఎంతవరకు అర్థం చేసుకున్నారనే వివరాలను అడుగుతూ కలెక్టర్ ముందుకుసాగారు. స్వయంగా జిల్లా కలెక్టర్ గణిత పాఠ్యాంశాన్ని సులువుగా అర్థమయ్యేట్టు బోధించడంతో పాఠశాల విద్యార్థులు సంబరపడ్డారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.ఆనందంతో మాట్లాడిన కలెక్టర్ విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, ప్రతి విద్యార్థి విద్యా ప్రగతి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యను అందించడం ద్వారా ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యార్థుల సంఖ్యను పెంచుకోవచ్చునని అన్నారు. ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, మెరుగైన మౌలిక సదుపాయాలు, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకం వంటి సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించి ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంచాలని తెలిపారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, గణితం లెక్కలు చేయడంలో నైపుణ్యం సాధించేలా ఉపాధ్యాయులు నిరంతరం శ్రమించాలని, విద్యార్థుల అభ్యాస ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పాఠశాలలోని తరగతి గదులు, మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనశాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు.
అనంతరం పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి వారి తల్లులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని డంపింగ్ యార్డ్, గ్రామపంచాయతీ కార్యాలయంలోని నర్సరీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చింతకుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాంభూపాల్, జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, జిల్లా శిశు సంక్షేమ అధికారి విశ్వజ, తహసీల్దార్ విక్రమ్ కుమార్ , ఎంపీడీవో నర్మద, అధికారులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# పేదల కోసం భూ పోరాటాలు తీవ్రతరం చేస్తాం

- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు
- హనుమకొండ కలెక్టరేట్ ఎదుట వామపక్షాల పికెటింగ్
- అధికారులను అడ్డుకున్న శ్రేణులు, నాయకుల అరెస్టు



**హనుమకొండ, ఆయుధం:** పేదల కోసం భూ పోరాటాలను తీవ్రతరం చేస్తామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సిపిఐ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట వామపక్షాలు భారీ పికెటింగ్ నిర్వహించారు. ఉదయం 9 గంటలకే కలెక్టరేట్ కు చేరుకున్న వామపక్షాల నాయకులు, కార్యకర్తలు అధికారులను, సిబ్బందిని కలెక్టరేట్ లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఉదయం నుంచే పికెటింగ్ నిర్వహించడం ప్రధాన రోడ్డు పైనే వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పేదల ఇళ్ళ స్థలాల సాధన కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని అన్నారు. ఇళ్ళ స్థలాలకు పట్టాలు సాధించే వరకు ప్రభుత్వం, అధికారులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని అన్నారు. ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ మాఫియా, కబ్జాదారుల నుండి కాపాడి, ఆ భూములను పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేది రాష్ట్రంలో వామపక్షాలేనని అన్నారు. భూములలో ప్రభుత్వం పేదలకు నివాస స్థలాలుగా కేటాయించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలనే తాము డిమాండ్ చేశారు. నిరుపేదలపై దాడులకు పాల్పడుతున్నదని, పేదలపై ఆపాలని వారు తీవ్రంగా హెచ్చరించారు. అనంతరం పికెటింగ్ నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులను సుబేదారి పోలీసులు అరెస్టు చేశారు. వామపక్ష పార్టీల కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట, ఉద్రిక్తత చోటు చేసుకుంది. శ్రీనివాసరావుతో సహా వామపక్షాల నాయకులను అరెస్టు చేసి సుబేదారి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం, ఎంసిపిఐ జిల్లా కార్యదర్శులు కర్రె బిక్షపతి, జి.ప్రభాకర్ రెడ్డి, ఎన్ రెడ్డి హంసారెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మణ్, ఎన్.అశోక్ స్టాలిన్, ఏదునూరి వెంకట్రాజం, కొట్టెపాక రవి, వేల్పుల సారంగపాణి, బత్తిని సదానందం, జక్కు రాజు గౌడ్, ఏశబోయిన శ్రీనివాస్, ఎన్.రాజమౌళి, సిపిఎం జిల్లా నాయకులు రాగుల రమేష్, బొట్ల చక్రపాణి, వీరన్న, టి.ఉప్పలయ్య, మంద సంపత్, గుమ్మడి రాములు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు పట్టాలు, ఇండ్లు ఇచ్చే వరకు పోరాటం ఆగదు

- వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి



**హనుమకొండ, ఆయుధం:** అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలు పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే వరకు పోరాటం ఆగదని సిపిఐ ఎం సి పి ఐ (యు) జిల్లా కార్యదర్శులు ఎండి బాష్మియా పెద్దారపు రమేష్ సిపిఎం జిల్లా నాయకుడు సింగారపు బాబు హెచ్చరించారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రభుత్వ భూములను రక్షించి గుడిసె వాసులకు పట్టాలు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఏకశిలా పార్కు నుంచి వరంగల్ కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి నినాదాలు చేస్తూ కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్న క్రయవిక్రయాలు జరుపుతున్న పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం పేదలు నిలువ నీడ కోసం 40 50 60 గజాలలో గుడిసెలు వేసుకుంటే మాత్రం కేసులు పెట్టి నిర్బంధాలను ప్రయోగించి గుడిసెలను తొలగించి నిరాశ్రయులు చేస్తున్నారని ఎంతవరకు సమంజసమని అన్నారు. అనంతరం జిల్లా డిఆర్ఓ విజయలక్ష్మి ద్వారా కలెక్టర్కు మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సిపిఎం ఎంసిపిఐ (యు), న్యూడెమోక్రసీ, లిబరేషన్ రాష్ట్ర జిల్లా నాయకులు రంగయ్య, సాగర్, దయాకర్, యాదగిరి, రాచర్ల బాలరాజునర్ర ప్రతాప్, కన్నం వెంకన్న, ముక్కెర రామస్వామి, దండు లక్ష్మణ్, సంధ్య, సాంబమూర్తి, రత్నమాల, ఆరూరి కుమార్, గణిపాక ఓదేలు, నరసయ్య, పేదలు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోపు ఓటరు గణన ప్రక్రియను పూర్తి చేయాలి

- రాజకీయ పార్టీలు సహకారం అందించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు, ఆయుధం:** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని, సవరణ ప్రక్రియ పారదర్శకంగా, ఎటువంటి సందేహాలకు తావులేకుండా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ప్రత్యేక సవరణ కార్యక్రమానికి సంబంధించి ఎన్నికల సంఘం ఇప్పటికే పూర్తి కార్యాచరణ ప్రణాళికను అందించిందని తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన ప్రతి దశను నిర్దేశిత సమయపట్టిక ప్రకారం అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఓటరు గణన ఫారాల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైందని, ఈ కార్యక్రమాన్ని కేవలం బూత్ స్థాయి అధికారులు మాత్రమే ఇంటింటికీ వెళ్లి నిర్వహిస్తారని, రాజకీయ పార్టీలకు చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు ఫారాల పంపిణీ చేయరాదని స్పష్టం చేశారు. జిల్లాలోని బూత్ స్థాయి అధికారులకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, తిరిగి స్వీకరణ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ అందించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రక్రియ సక్రమంగా జరుగుతుందా లేదా అని పరిశీలించవచ్చని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై పరస్పర విశ్వాసం పెంపొందించేందుకు ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశాల్లో వచ్చిన సూచనలు, అభ్యంతరాలను నమోదు చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.
ప్రత్యేక సవరణ కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం జూన్ 15 నుంచి జూన్ 24 వరకు సన్నాహక కార్యక్రమాలు, శిక్షణ పూర్తయ్యాయని తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటరు గణన కార్యక్రమాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను జూలై 24లోపు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్‌డీఓ కృష్ణవేణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కుషీల్ వంశీ, ఏఈఆర్ఓ తహసిల్దార్ విజయ భాస్కర్, ఎన్నికల సిబ్బంది, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఐసీసీసీ మాడ్యూళ్లపై అవగాహన ఉండాలి

- బల్దియా కమిషనర్ టి. వెంకన్న



**వరంగల్, ఆయుధం:** ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లో అందుబాటులో ఉన్న అన్ని మాడ్యూళ్ల పనితీరుపై సిబ్బందికి సంపూర్ణ అవగాహన ఉండాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అన్నారు. విపత్కర పరిస్థితుల్లో వేగంగా, సమర్థవంతంగా నిర్ణయాలు తీసుకునేందుకు ఐసీసీసీ కేంద్రం కీలక పాత్ర పోషించేలా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. బుధవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఐసీసీసీ కేంద్రాన్ని కమిషనర్ ఆకస్మికంగా సందర్శించి, అక్కడ కొనసాగుతున్న కార్యకలాపాలను పరిశీలించారు. కేంద్రంలోని వివిధ మాడ్యూళ్ల పనితీరు, వాటి వినియోగంపై అధికారులను అడిగి తెలుసుకుని, సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఐసీసీసీ నిర్వాహకులు కమిషనర్‌కు కేంద్రంలో అందుబాటులో ఉన్న సాంకేతిక వ్యవస్థలను వివరించారు. ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ మాడ్యూల్, అడాప్టివ్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ (ATCS) ద్వారా రియల్‌టైమ్ ట్రాఫిక్‌కు అనుగుణంగా ట్రాఫిక్ సిగ్నళ్ల నిర్వహణ, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్, అధిక వేగంతో ప్రయాణించే వాహనాల గుర్తింపు, ట్రాఫిక్ రద్దీ విశ్లేషణ, ప్రమాదాలపై తక్షణ హెచ్చరికల వ్యవస్థల గురించి వివరించారు. అలాగే, సర్వైలెన్స్ అండ్ పబ్లిక్ సేఫ్టీ మాడ్యూల్ ద్వారా నగరవ్యాప్తంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ప్రత్యక్ష ప్రసారాలు, కృత్రిమ మేధస్సు (AI) ఆధారిత వీడియో విశ్లేషణ, అనుమానాస్పద సంఘటనల గుర్తింపు, అత్యవసర హెచ్చరికల వ్యవస్థల పనితీరును వివరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ, ఐసీసీసీలోని ప్రతి మాడ్యూల్‌పై సిబ్బంది పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండటంతో పాటు ప్రతిరోజూ సాంకేతిక పరిజ్ఞానంపై తమ పరిజ్ఞానాన్ని నవీకరించుకోవాలని సూచించారు.



# విలేకరి సత్యంకు పరామర్శ

**వరంగల్, ఆయుధం:** వరంగల్ శివనగర్‌లో ప్రముఖ పత్రిక విలేకరి బత్తుల సత్యం ఇటీవల అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకుని, బీజేపీ శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ బుధవారం శివనగర్‌లోని వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మహమ్మద్ రఫీ.. సత్యం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అందుతున్న వైద్య సహాయం, ప్రస్తుతం విశ్రాంతి గురించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. జర్నలిస్టులు సమాజ సేవలో నిరంతరం శ్రమిస్తుంటారని, అలాంటి వారు అనారోగ్యానికి గురైనప్పుడు వారికి అండగా నిలవడం మన బాధ్యతని రఫీ పేర్కొన్నారు. బత్తుల సత్యం త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని, మళ్లీ తన విధి నిర్వహణలోకి రావాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఆయన ఆకాంక్షించారు.

# విబిజి రామ్ జి ని ఉపసంహరించాలి

- రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని కేంద్రం ఆమోదించాలి
- ఎం జి నరేగాను పునరుద్ధరించాలి.
- బి కె యం యు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు



**వరంగల్, ఆయుధం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం వెంటనే వి బి జి రామ్ జి చట్టాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి అమలు జరపాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు నిర్వహించిన పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వము ఉపాధి కూలీల ప్రయోజనాలను కాలరాసే కొత్త చట్టాన్ని ఉపసంహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రుల, ఉన్నత అధికారుల సమావేశంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పాల్గొని గ్రామీణ పేదల పని హక్కును బలహీనపరుస్తూ, గ్రామ పంచాయతీల అధికారాలను తగ్గించడం, రాష్ట్ర ప్రభుత్వాల పాత్రను పరిమితం చేయడం, పనుల ఎంపిక ,నిధుల కేటాయింపు ,అమలు పర్యవేక్షణ వంటి కీలక అధికారాలు కేంద్రం వద్ద కేంద్రీకరించడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమైనందున విబి జి రామ్ జి చట్టాన్ని ఉసంహరించుకొని ఎం జి నరేగా ను పునరుద్ధరించి హక్కు ఆధారిత కార్యక్రమంగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారన్నారు. పాత విధానంలో కేంద్ర ప్రభుత్వము 90% రాష్ట్ర ప్రభుత్వము 10% నిధులు భరించే దాన్ని మార్చి కేంద్రము 60 శాతం, రాష్ట్రాలు 40% భరించే విధానం తేవడం వల్ల రాష్ట్రాలపై పెను భారం పడి ఉపాధి పనులు అట్టకెక్కే ప్రమాదం ఉందని ఫలితంగా కూలీలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు.

Edited, Printed, Published and Owned by V.P.CHANDER. On Behalf of VNR MEDIA. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695